నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 12 ఏప్రిల్ 2024 | HYDERABAD

మాజీ హోం మంత్రి మహమూద్ అలీ నివాసంలో రంజాన్ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, వివేకానంద్ తదితరులు

గ్రేటర్వ్యాప్తంగా గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించి.. ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. చిత్రంలో తెలంగాణ భవన్‌లో జరిగిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు.

చోరీ కథ అల్లి.. వస్తువులు పడేసి

ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకొని..దొంగతనం డ్రామా

ఓ యువతి నిర్వాకం..కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు



బండ్లగూడ, ఏప్రిల్ 11: ఆన్‌లైన్ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకున్న ఓ యువతి.. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పేందుకు భయపడి.. ఇంట్లో దొంగతనం జరిగిందంటూ హైడ్రామా ఆడింది. చోరీ జరిగినట్లు రత్తికట్టించేలా.. ఇంట్లోని వస్తువులనూ చిందరవందర పడేసింది. చివరికి పోలీసులకు దొరికిపోయింది. రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలివి.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఎర్రబోడలో నివాసముంటున్న డిగ్రీ చదువుతున్న ఓ యువతి గురువారం ఉదయం.. మా ఇంట్లో ముసుగులు ధరించిన దుండగులు దొంగతనానికి పాల్పడినట్లు స్థానిక మీడియా ప్రతినిధులకు తెలిపింది. దీంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు, మీడియా వివరాలు సేకరించగా.. ఇంట్లోకి చొరబడిన దుండగులు బీరువాలో రూ. 25వేలు ఎత్తుకెళ్లినట్లు సదరు యువతి తెలిపింది. తాను వాష్‌రూమ్‌కు వెళ్లే వచ్చే సరికి చోరీ జరిగినట్లు నమ్మించింది. అనుమానం రాకుండా ఇంట్లోని వస్తువులను సైతం చిందరవందపడేసింది. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఆ యువతిపై అనుమానం వచ్చింది. ఆమెను విచారించగా, అసలు విషయం చెప్పింది. ఆన్‌లైన్ గేమింగ్‌లో రూ. 25 వేలు పోగొట్టుకున్నట్లు తెలిపింది. డబ్బుల గురించి తల్లిదండ్రులు అడిగితే ఏమి చెప్పాలో తెలియక.. భయంతో దొంగతనం జరిగినట్లు నాటకం అడినట్లు తెలిపిందని పోలీసులు చెప్పారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి విడిచిపెట్టినట్టు తెలిపారు.

ఎర్లీబర్డ్‌కు స్పందన అంతంతే..

లక్ష్యం 800 కోట్లు.. 170 కోట్లే వసూలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): ముందుస్తుగా ఆస్తిపన్ను చెల్లిస్తూ 5 శాతం రాయితీ పొందేందుకు నగరవాసులు అనాసక్తి కనబరుస్తున్నారు. రూ.కోట్లలో పన్ను చెల్లించే బడా సంస్థలతో పాటు సామాన్యులు ఈ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటారని జీహెచ్ఎంసీ భావించి ప్రతి ఏటా మాదిరిగానే ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు 'ఎర్లీబర్డ్' స్కీంను అందుబాటులోకి తెచ్చింది. 30 సర్కిళ్ల పరిధిలోని రూ.800కోట్ల మేర లక్ష్యాన్ని ఖరారు చేసుకున్నది. అయితే గడిచిన 11 రోజులుగా 2.29 లక్షల మంది మాత్రమే సద్వినియోగం చేసుకోగా.. రూ.170 కోట్ల పన్నును రాబట్టుకున్నది. నిర్దేశిత లక్ష్యంలో ఇప్పటి వరకు 40 శాతం పైగా ఆదాయం దాట లేదు. దీనికి కారణం కమిషనర్ మొదలు ఉన్నతాధికారుల వరకు పార్లమెంటు ఎన్నికల విధుల్లో ఉండటం..క్షేత్రస్థాయిలో ఉండే అధికారులపై పర్యవేక్షణ లేక పోవడం..ఎర్లీబర్డ్ స్కీంపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడమేనని అంటున్నారు. ముఖ్యంగా రూ. కోట్లలో ఆస్తిపన్ను బకాయి ఉన్న వారికి తరచూ ఎర్లీబర్డ్ స్కీం సద్వినియోగంపై ఎస్ఎంఎస్‌లు చేర్చేవారు. కానీ ఈ సారి అవగాహన కల్పనలో అధికారులు ఫెయిల్ అయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని జోన్ల కంటే ఖైరతాబాద్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ల నుంచి ఎర్లీబర్డ్ స్కీంకు ఆశించిన స్పందన రాలేదని సమాచారం.

గృహజ్యోతిలో మెలిక

చూసి మురవ.. చెప్పకొని ఏడవ..

అదనంగా రూ. 25 జరిమానా వేసి..
లబ్ధిదారులకు ఝలక్ ఇచ్చిన టీఎస్ఎస్పీడీసీఎల్
ఎక్స్‌లో రెండు బిల్లులు పోస్టు చేసిన లబ్ధిదారులు
పోస్టు తొలగించమంటూ బతిమిలాడిన అధికారులు

గతనెల జీరో బిల్ ఇచ్చి మురిపించి.. తాజాగా పాత బిల్లును జోడించి..

బడంగ్‌పేట, ఏప్రిల్ 11: ఆరు గ్యారెంటీల ఆశతో ఆశల పల్లకిలో ఉన్న లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రేవంత్ సర్కారు అట్టహాసంగా ప్రకటించి, అమలు చేశామంటున్న గృహజ్యోతి ''చూసి మురవ..చెప్పకొని ఏడవ''.. అన్నట్లుగా తయారైంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ టీఎస్ఎస్పీడీసీఎల్ అధికారులు గందరగోళంతో నగర శివారుల్లోని పలు కార్పొరేషన్ల పరిధుల్లో కొన్ని కాలనీల్లో గృహజ్యోతి పథకాన్ని అమలు చేశారు. జీరో బిల్లును జారీ చేసి లబ్ధిదారులకు అందించారు. ఎన్నికల కోడ్ ఉన్నదని ఉన్నతాధికారులు ఆపేయమనడంతో వెంటనే నిలిపివేశారు. ఈలోగా జారీ చేసిన జీరో బిల్లులను అందుకున్న లబ్ధిదారులు ఎంతో సంబురపడ్డారు. కానీ వాళ్ల ఆనందం.. నెల రోజుల్లోనే ఆవిరైంది. తాజాగా ఈ నెల జారీ చేసిన కరెంటు బిల్లుల్లో గత నెల బిల్లులను కూడా జోడించిన అధికారులు.. లబ్ధిదారులకు ఝలక్ ఇచ్చారు. దీంతో ఇదెక్కడి అన్యాయమంటూ నిరుపేదలు లబోదిబోమంటున్నారు. వినియోగదారులు కొందరు తమ ఆవేదనను ఎక్స్ వేదికగా పంచుకోవడం వైరల్‌గా మారింది. తీరా... ఆరా తీస్తే ఒకరిద్దరురూ కాదు.. వేలల్లోనే లబ్ధిదారులకు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైనట్లు తెలుస్తున్నది.

గృహజ్యోతి ఓ ప్రహసనంలా..

కాంగ్రెస్ సర్కారు సంక్షేమ పథకాలు మూడడుగులు ముందుకు... ఆరడుగులు వెనక్కి అన్నట్లు తయారయ్యాయి. ఆరు హామీల్లో భాగమంటూ ప్రారంభించిన మహాలక్ష్మి పథకం కింద రూ. 500 గ్యాస్ సిలిండర్ అసలు అమలవుతుందా? లేదా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. ఇక.. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు పథకమైన గృహజ్యోతి ఓ ప్రహసనంలా మారింది. రాష్ట్రవ్యాప్తంగా గత నెలలోనే ఈ పథకాన్ని ప్రారంభించారు. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పరిధిలోకి వచ్చే ఉమ్మడి రంగారెడ్డిలో పథకం అమలు గందరగోళానికి దారి తీసింది. ఈ పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి గత ఫిబ్రవరి 27న ప్రారంభించగా... విద్యుత్ శాఖ అధికారులు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనూ మార్చి నెల కరెంటు బిల్లుల జారీలో పథకాన్ని అమలు చేశారు. వందలాది మందికి జీరో బిల్లులు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉందంటూ ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే నిలిపివేసి, సాధారణ బిల్లులు జారీ చేశారు. జీరో బిల్లులు అందుకున్న వారికి తిరిగి సాధారణ బిల్లులు ఇవ్వకపోవడంతో లబ్ధిదారులు మురిసిపోయారు. కానీ నెల తిరిగేసరికి వచ్చిన తాజా కరెంటు బిల్లులు చూసి షాక్ అయ్యారు. గత నెల జారీ చేసిన జీరో బిల్లుల్లోని మొత్తాన్ని కూడా తాజా బిల్లుతో జోడించి ఇవ్వడంతో లబ్ధిదారులు నోరెళ్లబెట్టారు. ఒకసారి రెండు నెలల బిల్లులు ఎలా చెల్లించాలంటూ లబోదిబోమంటున్నారు.

గోప్యంగా ఉంచేందుకు..

తాజా కరెంటు బిల్లుల్లో గత నెల బిల్లును కూడా జోడించి ఇవ్వడంతో నిరుపేదలు ఆందోళనకు గురయ్యారు. మహేశ్వరం లెనిన్‌నగర్‌కు చెందిన వినియోగదారులు కొందరు ఎక్స్ వేదికగా తన కరెంటు బిల్లులను జోడిస్తూ ఆవేదనను పోస్టు చేశారు. ఇవి సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఉలిక్కిపడిన చంపాపేట్ విద్యుత్ శాఖ అధికారులు ఆ పోస్టును తొలగించాలంటూ లబ్ధిదారుడు నర్సింగ్‌రావును బతిమిలాడారు. ఇతనికే కాదు... మీర్‌పేట పరిధిలోని లెనిన్‌నగర్, ప్రశాంత్‌నగర్, చింతల్‌కుంటతో పాటు బడంగ్‌పేట పరిధిలోని మల్‌రెడ్డి రంగారెడ్డి నగర్, జయశంకర్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, రాజీవ్ గృహకల్ప, అల్మాస్‌గూడ పాతబస్తీ ఇలా అనేక ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి. రెండు నెలల బిల్లు ఒకేసారి రావడం ఒక వంతైతే... అధికారుల తప్పిదానికి సైతం లబ్ధిదారులే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తున్నది. గత నెల బిల్లు కట్టనందుకు అదనంగా రూ.25 సర్‌చార్జీని కూడా తాజా బిల్లుల్లో జోడించడం మరో కొసమెరుపు.

ఇది ఎక్కడి న్యాయం..

కాంగ్రెస్ అధికారం కోసం ఆరు గ్యారెంటీలు ఇస్తున్నట్లు ప్రకటన చేసింది. ప్రజలు ఎవరూ కూడా మాకు ఇది కావాలని అడుగలేదు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం మార్చి నెలలో 200 యూనిట్లు వచ్చిన వారికి జీరో కరెంటు బిల్లులు ఇచ్చి పోయారు. ఏప్రిల్ నెలలో మరోసారి రెండు నెలల బిల్లు ఇచ్చారు. అదే కాకుండా పెనాల్టీ కింద 25 రూపాయలు వేశారు. ఏ నెలకు ఆ నెల బిల్లు కట్టుకోవడం కష్టమంటే రెండు నెలలకు సంబంధించిన బిల్లులు కట్టమని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. లేదంటే కరెంటు కట్ చేస్తామని వార్నింగ్ ఇచ్చి పోతున్నారు. ఇది ఎక్కడి న్యాయం.. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పింది ఒకటి చేసేది మరోలా ఉంది. ఇది మంచి పద్ధతి కాదు.

- ముత్యాల నర్సింహ, జయశంకర్ కాలనీ, అల్మాస్‌గౌడ

రెండు నెలల బిల్లు ఎలా కట్టాలి?

మొదట ఇక నుంచి కరెంటు బిల్లు కట్టనవసరం లేదన్నారు. ఇప్పుడేమో రెండు నెలల బిల్లులు కట్టమంటున్నారు. విద్యుత్ బిల్లు తగ్గించమని గాని, ఉచితంగా ఇవ్వమని గాని అడిగామా? ఎందుకు మోసం చేయడం, బిల్లులు కట్టపోతే కరెంటు ఉండదంటున్నారు. పేదోళ్లను మోసం చేస్తున్నారు. మాట ఇచ్చి తప్పుతున్నారు. ఓట్లు వేసిన తర్వాత మాట మార్చారు. పై నుంచి మాకు ఆర్డర్ రాలేదని కరెంటోళ్లు చెబుతున్నారు. ఏ నెలకు ఆ నెల బిల్లు కట్టుకునే వాళ్లం. ఇప్పుడు కొత్త కథ చెప్పి రెండు నెలల బిల్లు పంపించారు. **- వరిసే వెంకటమ్మ, అల్మాస్‌గూడ, జయ శంకర్ కాలనీ**

కాంగ్రెస్ వచ్చాక కష్టాలు..

మొదట జీరో కరెంటు బిల్లు ఇచ్చారు. ఇప్పుడు రెండు కలిపి బిల్లు కంటమంటే ఎలా అంటే.. ఎవరికీ చెప్పవద్దని అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. అధికారుల తీరు బాగలేదు. నమ్మించి మోసం చేస్తున్నారు. మాకు ఉచితంగా కరెంటు ఇవ్వని మేము ఎప్పుడు అడగలేదు. వారే చెప్పండ్రు. ఏ ఒక్కటీ అమలు చేయడం లేదు. గతం కన్నా.. విద్యుత్ బిల్లు ఎక్కువ వచ్చింది. ఎందుకు వచ్చిందంటే పైన అడుగమంటున్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత కష్టాలు మొదలయ్యాయి. **- శ్రీనివాస్, లబ్ధిదారుడు**

ఏది ఉచిత కరెంటు?

మార్చి నెలలో చాలా మందికి విద్యుత్ అధికారులు జీరో బిల్లులు ఇచ్చారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేస్తామని ఎన్నికల వాగ్దానంలో చెప్పారు. చాలా మంది మా మిత్రులకు జీరో బిల్లు వచ్చిందని సంతోషపడ్డారు. మార్చి నెలలో సంతోషపడితే ఏప్రిల్‌లో రెండు బిల్లులు కలిపి వచ్చిందని చెప్పారు. ఇది మోసం అనుకొని ట్విట్టర్ వేదికగా పోస్టు చేశాను. మార్చి , ఏప్రిల్ నెలల బిల్లులను కలిపి పోస్టు చేశాను. చంపాపేటకు చెందిన విద్యుత్ అధికారులు ఆ పోస్టు తీసేయమని బతిమిలాడారు. మా ఉద్యోగాలు పోతాయని మొర పెట్టుకున్నారు. దీంతో పోస్టును తొలగించాను. ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది పెద్ద మోసం.

- నర్సింగ్ రావు, మీర్‌పేట, (ఎక్స్‌లో పోస్టు చేసిన వ్యక్తి)

సెలవుల్లేవ్

వచ్చే రెండు నెలలు.. మరింత అలర్ట్

నీటి కొరత అధిగమించడమే లక్ష్యం

సిబ్బందికి వేసవి ముగిసే వరకు సెలవులు రద్దు

జలమండలి ఎండీ కీలక ఆదేశాలు

12 గంటల్లోపు ట్యాంకర్ నీరు, అత్యవసర పంపింగ్ సవాలే

సిటీబ్యూరో, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో రోజురోజుకు పెరుగుతున్న తాగునీటి డిమాండ్‌ను అధిగమించేందుకు జలమండలి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకెళ్తున్నది. మండుతున్న ఎండలు ఒకవైపు.. అడుగంటి భూగర్భ జలాలతో తాగునీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. అరకొర నీటి సరఫరాతో బస్తీవాసులు డ్రమ్ముల్లో నీటిని నింపుకుంటూ, మరికొందరూ వాటర్ ట్యాంకర్ల కోసం అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే వెస్ట్‌కారిడార్‌లో అపార్ట్‌మెంట్ వాసులు, వాణిజ్య వ్యాపారస్తులంతా జలమండలి ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. సంస్థ పరిధిలో రోజూ 6500 నుంచి 7000 వరకు ట్యాంకర్ల బుకింగ్ జరుగుతున్నాయంటే డిమాండ్ ఏ మేరకు ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు, ఫిల్లింగ్ పాయింట్స్, ట్యాంకర్లను అదనంగా సమకూర్చుతున్నామని అధికారులు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ట్యాంకర్ బుక్ చేస్తే మూడు రోజుల పాటు నిరీక్షణ తప్పడం లేదు. ఈ క్రమంలోనే నగరానికి ఐదు వనరుల నుంచి రోజూ 560 ఎంజీడీల మేర నీటిని అందిస్తుండగా..సింగూరు, మంజీరా మినహా జంట జలాశయాలు, ఎల్లంపల్లి, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల నీటి నిల్వలు ఆందోళనకరంగా మారాయి. ఈ క్రమంలోనే అత్యవసర పంపింగ్ ద్వారా నగరానికి తరలించి సరఫరా చేయనున్నారు. వచ్చే రెండు నెలల పాటు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. సంస్థ పరిధిలో డైరెక్టర్లు, ఇంజినీర్లు, ఇతర సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉండాలని, వేసవి ముగిసే వరకు అందరికీ సెలవులను రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. మొత్తంగా 12 గంటల్లోపు వాటర్ ట్యాంకర్ నీటి సరఫరా, అత్యవసర పంపింగ్ అధికారులకు సవాల్‌గా మారుతున్నది.

గులాబీ జెండా ఎగురవేద్దాం

మీర్‌పేట సమావేశంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, ఏప్రిల్ 11: చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగుర వేయడానికి బీఆర్ఎస్ కార్యకర్తలు కంకణ బద్ధులై పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని లెనిన్ నగర్‌లో గురువారం జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చలో చేవెళ్ల కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈనెల13న చేవెళ్లలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు చెప్పారు. అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని మూడో సారి చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగుర వేద్దామన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి కోరారు. ఈ సమావేశంలో మీర్‌పేట మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, కార్పొరేటర్లు అనిల్ కుమార్ యాదవ్, బాలమణి, రాజేందర్‌రెడ్డి, కో ఆప్షన్ పల్లె జంగయ్య గౌడ్, బీఆర్ఎస్ నాయకులు అర్కల కామేశ్ రెడ్డి, భూపేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేట సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

గెలుపు తథ్యం.. మెజార్టీయే లక్ష్యం

కంటోన్మెంట్ సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

కంటోన్మెంట్, ఏప్రిల్ 11: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నికతో పాటు మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు తథ్యమని, మెజార్టీయే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నిక నేపథ్యంలో గురువారం బోయిన్‌పల్లిలోని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతల సన్నాహక సమావేశం జరిగింది. మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత, కంటోన్మెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్ రెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సాయన్న సేవలను అందరూ గుర్తుకు తెచ్చుకోవాలని కోరారు. ఏడాది కాలంలోనే ఎమ్మెల్యేలు సాయన్న, లాస్యనందితను కోల్పోవడం బాధాకరమన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లోనే తిరిగి తెలంగాణ ప్రాంతాన్ని తమ నీచ రాజకీయాలతో ఏడారిగా మారుస్తున్నదని మండిపడ్డారు. కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఆశీర్వదించాలని, అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, చిత్రంలో మల్కాజిగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత



బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా తదితరులు

కాంగ్రెస్ వచ్చింది.. కష్టాలు తెచ్చింది

ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

గెలిపిస్తే పార్లమెంటులో తెలంగాణ గళం వినిపిస్తా

ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

ఎల్బీనగర్ , ఏప్రిల్ 11 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి కరెంటు, మంచినీటి కష్టాలు తెచ్చిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ ఇండ్లలో మూలన పెట్టిన ఇన్‌వర్టర్లు, జనరేటర్లను రెడీ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట, చైతన్యపురి, గడ్డిఅన్నారం డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కలిసి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో బీఆర్ఎస్ జెండా ఎగురడం ఖాయమని, ఎంపీగా రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు తథ్యమన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించాలని కోరారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులంతా ఇంటింటికీ ప్రచారం చేసి.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి భారీ మెజార్టీని అందించాలన్నారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మాట్లాడుతూ నియోజకవర్గంలోని శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పనిచేసిన రీతిలోనే పార్లమెంటు ఎన్నికల్లోనూ పనిచేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తాను స్థానికుడినని, అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని, బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే పార్లమెంటులో తెలంగాణ గళం వినిపిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు జీవీ సాగర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, వివిధ డివిజన్ల అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్, జక్కల శ్రీశైలం యాదవ్, తోట మహేశ్ యాదవ్, నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వర్ రావు, గజ్జల మధుసూదన్‌రెడ్డి, జోగు రాములు, సొంటి చంద్రశేఖర్‌రెడ్డి, పులిపాటి త్రివేది తదితరులు పాల్గొన్నారు.